హెజ్బొల్లాకు మరో షాక్

- ఇజ్రాయెల్ దాడిలో సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ మృతి
- వారం రోజుల్లో ఏడుగురు టాప్ కమాండర్లు హతం
- ఇరాన్ గూఢచారి ఇచ్చిన సమాచారంతోనే నస్రల్లా హత్య
- హెజ్బొల్లా కొత్త అధిపతిగా హషీమ్ సఫీద్దీన్!

జెరూసలేం, సెప్టెంబర్ 29: లెబనాన్ తీవ్ర వాద సంస్థ హెజ్బొల్లాకు మరో భారీ షాక్ తగిలింది. ఇజ్రాయెల్ దాడిలో మరో కీలక నేత మృతిచెందాడు. శనివారం తాము జరిపిన దాడిలో హెజ్బొల్లా సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ నబిల్ కౌక్ హతమైనట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. హెజ్బొల్లా కూడా కౌక్ మృతిని ధ్రువీకరించింది. గత వారం రోజుల్లో ఇజ్రాయెల్ దాడిలో సంస్థ చీఫ్ నస్రల్లా సహా ఏడుగురు టాప్ కమాండర్లు మృతిచెందారు. అయితే ఆదివారం కూడా బీరుట్‌లో మరో లక్షిత దాడిని జరిపినట్టు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. అలాగే యెమెన్‌లోని హౌతీ స్థావరాలపైనా దాడులు చేసినట్టు తెలిపింది. ముఖ్యంగా హూడెయిడా పోర్టు సిటీలో పవర్ ప్లాంట్లు, సీపోర్టు లక్ష్యంగా వైమానిక దాడులు చేసినట్టు వెల్లడించింది.

నస్రల్లా హత్యకు గురైన స్థలం సమీపంలోని భవనాల శిథిలాలను పరిశీలిస్తున్న స్థానికుడు

నస్రల్లాను ఎలా హతమార్చారంటే?

హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను లక్షిత దాడుల్లో ఇజ్రాయెల్ దళాలు చంపడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఒక ఇరానీ గూఢచారి ఇచ్చిన సమాచారాన్ని నిర్ధారించుకునే ఇజ్రాయెల్ వాయుసేన పక్కా ప్రణాళికతో అండర్ గ్రౌండ్ బంకర్‌లో ఉన్నప్పటికీ అతడిని హతమార్చినట్టు ఫ్రెంచ్ వార్తాపత్రిక లే పారిసియన్ తెలిపింది. బీరుట్‌లోని ఒక భవనంలో ఉపరితలానికి 60 అడుగుల కింద ఉన్న అండర్ గ్రౌండ్‌లో అగ్రనేత సమావేశమవుతున్నట్టు ఇజ్రాయెల్‌కు సమాచారం వచ్చిందని ఆ పత్రిక తన కథనంలో పేర్కొంది. ఈ దాడిలో ఇజ్రాయెల్ వాయుసేన సుమారు 80 టన్నుల పేలుడు పదార్థాలతో పాటు బంకర్లను సమూలంగా ధ్వంసం చేసే 85 'బంకర్-బస్టర్' బాంబులు (ఒక్కొక్కటి 907 నుంచి 1814 కేజీల బరువు) వినియోగించింది. ఇవి ఆరు మీటర్ల కాంక్రీట్ లేదా 30 అడుగుల భూమి లోపలి వరకు పోయి విధ్వంసం సృష్టించగలవు. ఇంటెలిజెన్స్, మిలటరీని సమన్వయం చేసుకుంటూ ఆ దేశ 69 స్క్వాడ్రన్ వాయుసేన బృందం నస్రల్లాను హతమార్చే ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించింది.

హెజ్బొల్లా చీఫ్‌గా హషీమ్ సఫీద్దీన్!

హెజ్బొల్లాకు 32 ఏండ్లుగా సారథ్యం వహిస్తూ వచ్చిన నస్రల్లా మరణంతో అతని వారసునిగా హషీమ్ సఫీద్దీన్‌ను ఎంపిక చేయవచ్చునని భావిస్తున్నారు. శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇతను కూడా నస్రల్లాతో మరణించినట్టు తొలుత వార్తలొచ్చాయి. అయితే తర్వాత అది నిజం కాదని నిర్ధారణ అయ్యింది. 1964లో జన్మించిన సఫీద్దీన్ మిలటరీ ఆపరేషన్లలో ఆరితేరిన వ్యక్తి. ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ సంతతని సూచించేలా నల్లటి తలపాగాను ధరించి మత గురువుగా కన్పిస్తాడు. ప్రస్తుతం హెజ్బొల్లా రాజకీయ వ్యవహారాలు చూస్తూ జిహాద్ కౌన్సిల్ గ్రూపుల సభ్యునిగా ఉన్న సఫీద్దీన్.. నస్రల్లా కజిన్ కూడా. 2017లోనే ఇతడిని అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. నస్రల్లా కూడా ఇతనికి సంస్థలో వివిధ హోదాలు కట్టబెట్టి అతడిని నేతగా తయారు చేశారు. అతని భౌతిక తీరు, ప్రవర్తన కూడా నస్రల్లాను పోలి ఉంటుంది. అతను తరచూ చేసే ప్రకటనలు పాలస్తీనా అనుకూల, హెజ్బొల్లా విధానాలను స్పష్టం చేసేవి. 2020లో వివాహమైన అతని కుమారుడు రిదా అదే ఏడాది బాగ్దాద్‌పై అమెరికా జరిపిన వాయుసేన దాడిలో మరణించాడు. 2006లో ఇజ్రాయెల్ దాడుల సందర్భంగా నస్రల్లా అజ్ఞాతంలోకి వెళ్లగా, సఫీద్దీనే సంస్థ కార్యక్రమాలకు ప్రతినిధిగా హాజరయ్యేవాడు.

హషీమ్

నబిల్ కౌక్

పటిష్ఠ నిఘా వ్యవస్థ

నిఘా వ్యవస్థలు అందిస్తున్న కీలక సమాచారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ లక్షిత దాడులకు ఎంతో ఉపయోగపడుతున్నట్టు న్యూయార్క్ టైమ్స్ కూడా పేర్కొంది. ఇజ్రాయెల్ ఇదంతా గత కొన్ని ఏండ్లుగా అమలు చేస్తున్న పక్కా ప్రణాళిక వల్లే సాధ్యమైంది. హెజ్బొల్లా వ్యూహాలు, నేతల కదలికలను ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ద్వారా సేకరిస్తున్నది. ఇజ్రాయెల్ సిగ్నల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 8200 ద్వారా అత్యాధునిక సైబర్ టూల్స్‌ను వినియోగిస్తూ హెజ్బొల్లా సెల్‌ఫోన్లు, దాని కమ్యూనికేషన్‌కు అంతరాయం కలిగిస్తూ ఉంది. వీరు తమకు వస్తున్న సమాచారాన్ని తక్షణం ఇజ్రాయెల్ ఆర్మీ, వాయుసేనకు పంపించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

'బయానిక్ ఐ'తో అంధులకు చూపు!

- **ఆస్ట్రేలియా పరిశోధకుల అద్భుత ఘనత**
- **జంతువుల్లో విజయవంతమైన పరీక్షలు**
- **మనుషుల్లో సక్సెస్ అయితే అంధత్వానికి చెక్**

మెల్‌బోర్న్, సెప్టెంబర్ 29: అంధులకు తిరిగి చూపు తెప్పించడంలో పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. ఆస్ట్రేలియాలోని మోనష్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రపంచంలోనే మొదటి 'బయానిక్ ఐ'ని అభివృద్ధి చేశారు. 'గెన్నరిస్ బయానిక్ విజన్ సిస్టమ్'గా పిలుస్తున్న ఈ సాంకేతికత జంతువుల్లో విజయవంతమైంది. మనుషుల్లో విజయవంతమైతే చూపును కోల్పోయిన కోట్లాది మంది తిరిగి తమ దృష్టిని పొందవచ్చు. చికిత్స లేని అంధత్వానికి పరిష్కారం చూపడంలో ఈ సాంకేతికత విప్లవాత్మకంగా మారనుంది. దశాబ్ద కాలంగా ఈ సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అధునాతన వ్యవస్థ సాధారణంగా కంటి నుంచి మెదడుకు దృష్టి సమాచారాన్ని చెరవేసే నేత్ర నాడులను దాటి వెళ్లడం ద్వారా పని చేస్తుంది. ఇది నేరుగా మెదడులోని దృష్టి కేంద్రానికి సంకేతాలను పంపుతుంది. దీని వల్ల వినియోగదారుడు దృశ్యాలను చూడటానికి వీలవుతుంది. గొర్రెల్లో ఈ సాంకేతికతను ఉపయోగించినప్పుడు తక్కువ ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు మెల్‌బోర్న్‌లో ఈ సాంకేతికతను మనుషులపై ప్రయోగిస్తున్నారు.

ఎలా పని చేస్తుంది?

వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్, కెమెరాతో కూడిన హెడ్‌గేర్(తలపై ధరించే పరికరం)ను రోగులు ధరించాలి. ఈ మొత్తం సిస్టమ్‌లో చిన్న 9 ఎంఎం ఇంప్లాంట్స్ ఉంటాయి. విజువల్ డాటాను రిసీవ్ చేసుకుని, విశ్లేషించేందుకు వీటిని మెదడులో అమర్చుతారు. ఈ సాంకేతికత ద్వారా చూపును తిరిగి తెప్పించడంతో పాటు నరాల సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవాలని పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. మనిషి కన్ను అందించే 130 డిగ్రీల దృష్టి పరిధి కంటే కాస్త తక్కువగా ఈ కృత్రిమ కన్ను 100 డిగ్రీల వరకు దృష్టి పరిధిని అందిస్తుంది.

రాత్రి వేళల్లోనూ సౌరశక్తి ఉత్పత్తి

సరికొత్త డివైజ్‌ను రూపొందించిన ఆస్ట్రేలియా పరిశోధకులు

సిడ్నీ: సూర్యాస్తమయం తర్వాత సౌరశక్తి ఉత్పత్తిని సుసాధ్యం చేసేందుకు ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్ యూనివర్సిటీ పరిశోధకులు ఓ మార్గాన్ని కనుగొన్నారు. రాత్రి వేళల్లో సైతం మన ఇండ్లకు శక్తిని అందించగలిగే సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేయడంతోపాటు ఆ టెక్నాలజీతో రూపొందించిన ఓ పరికరాన్ని పరీక్షించారు. ఈ డివైజ్ అంతరిక్షంలో కూడా ఉపయోగపడుతుందో లేదో అంచనా వేయాలని యోచిస్తున్నారు. థర్మోరేడియేటివ్ విద్యుత్తు ఉత్పత్తి సూత్రంతో పనిచేసే ఈ టెక్నాలజీలో భూమి ఉపరితలం నుంచి వెలువడే ఉష్ణోగ్రతకు, అంతరిక్షంలో ఉండే చల్లదనానికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని ఉపయోగిస్తారు. వాస్తవానికి భూమితో పాటు అన్ని రకాల వస్తువుల నుంచి రాత్రి వేళల్లో సైతం ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ వెలువడుతుంది. ఆ రేడియేషన్‌ను ఈ పరికరం ఒడిసి పట్టి విద్యుత్తుగా మారుస్తుంది. అందుకోసం ఆ డివైజ్‌లో ప్రధానమైన ఓ విడిభాగం ఉంటుంది. అదే సెమీకండక్టర్. రేడియంట్ హీట్‌ను (వికిరణ ఉష్ణాన్ని) ఉపయోగించుకోగలిగేలా ప్రత్యేకంగా రూపొందించిన ఈ సెమీకండక్టర్ భూమి నుంచి పరారుణ కాంతి రూపంలో వెలువడే శక్తిని సంగ్రహించి విద్యుత్తుగా మారుస్తుంది. తద్వారా ఆ పరికరం రాత్రి వేళల్లో సైతం సౌరశక్తిని ఉత్పత్తి చేయగలుగుతుందని యూఎన్ఎస్‌డబ్ల్యూ పరిశోధకుల బృందం సారథి నెడ్ ఎకిన్స్ డ్యూక్స్ తెలిపారు.



100కుపైగా ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసిన రష్యా

కీవ్: రష్యాపైకి ఉక్రెయిన్ పెద్ద ఎత్తున డ్రోన్లను ప్రయోగించింది. వీటిలో 125 డ్రోన్లను రష్యా కూల్చేసింది. నైరుతి ప్రాంతమైన వోల్గోగ్రాడ్‌పై ఉక్రెయిన్ ప్రయోగించిన 67 డ్రోన్లను రష్యన్ ఎయిర్ డిఫెన్సెస్ కూల్చేసినట్లు చెప్పింది. వొరొనెజ్ ప్రాంతంలో 17 డ్రోన్లను, రొస్టొవ్ రీజియన్‌లో 18 డ్రోన్లను కూల్చేసినట్లు తెలిపింది. ఇదిలావుండగా, ఉక్రెయిన్ నగరం జపోరిజ్జియాపై శనివారం రాత్రి జరిగిన దాడిలో 14 మంది సాధారణ పౌరులు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల ఈ నగరంలో రవాణా వ్యవస్థ దెబ్బతిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు.

సిరియాపై అమెరికా దాడి

37 మంది ఉగ్రవాదుల మృతి

న్యూయార్క్, సెప్టెంబర్ 29: సిరియాపై అమెరికా జరిపిన దాడుల్లో 37 మంది మిలిటెంట్లు మరణించారు. సిరియా వాయువ్య ప్రాంతంలో ఉగ్రవాద ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అల్ ఖైదా అనుబంధ గ్రూపులు, వారితో సంబంధాలు ఉన్న మిలిటెంట్లపై మంగళవారం రెండు చోట్ల గగనతల దాడులు చేసినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం తెలిపింది. మృతులలో ఇద్దరు సీనియర్ మిలిటెంట్లు కూడా ఉన్నట్టు పేర్కొన్నది. అలాగే ఈ నెల 16న సెంట్రల్ సిరియాలోని మారుమూల అజ్ఞాత ప్రదేశంలో ఉన్న ఐఎస్ శిక్షణా శిబిరంపై పెద్దయెత్తున వైమానిక దాడులు చేసినట్టు తెలిపింది. ఆ దాడిలో నలుగురు సీనియర్ నేతలు సహా 28 మంది తీవ్రవాదులు మరణించినట్టు పేర్కొన్నది. తమ ప్రయోజనాలకు, అమెరికా మిత్రదేశాలు, భాగస్వాములకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించే ఐసిస్‌ను అదుపుచేయడానికే ఈ వాయుసేన దాడులు జరుపుతున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

కుంభమేళాకు 992 ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ: వచ్చే జనవరిలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళా భక్తుల కోసం రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. రైల్వే మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని వివిధ నగరాల నుంచి 6,580 రెగ్యులర్ రైళ్లతోపాటు అదనంగా 992 ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మౌలిక సదుపాయాల ఆధునికీకరణ కోసం రూ.933 కోట్లు కేటాయించింది. ప్రయాగ్‌రాజ్ డివిజన్, దాని పరిసర ప్రాంతాల్లో రూ.3,700 కోట్లతో రైల్వే ట్రాక్‌ల డబులింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

జమిలిపై మూడు బిల్లులు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: జమిలి ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు, ఒక సాధారణ బిల్లును తీసుకురానుంది. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి సంబంధించింది. ఇందుకోసం 82ఎ, 83(2) అధికరణలకు సవరణలు చేయాల్సి ఉంటుంది. 327 అధికరణకు సవరణ చేసి 'ఏక కాల ఎన్నికలు' అనే పదాన్ని పొందుపరచాల్సి ఉంటుంది. రాష్ర్టాల వ్యవహారాలకు సంబంధించిన ప్రతిపాదిత రెండో రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు పురపాలికలు, పంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిబంధనలకు సంబంధించినది. మూడో బిల్లు శాసనసభలు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇతర రాష్ర్టాల అసెంబ్లీలు, లోక్‌సభకు పేర్కొన్న విధంగానే నిబంధనలను సరి చేయడానికి సంబంధించినది.

సీపీఎం కోఆర్డినేటర్‌గా ప్రకాశ్ కారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: సీపీఎం పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ తాత్కాలిక సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత ప్రకాశ్ కారత్ వ్యవహరించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24న మధురైలో జరిగే పార్టీ సమావేశం వరకు ఆయనే కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని కేంద్ర కమిటీ ఆదివారం తెలిపింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ఈ నెల 12న మృతి చెందడంతో ఈ తాత్కాలిక నియామకాన్ని చేపడుతున్నట్టు ఢిల్లీలో సమావేశమైన కేంద్ర కమిటీ ప్రకటించింది. కాగా పార్టీలో సీనియర్ నేత అయిన ప్రకాశ్ కారత్ 2005 నుంచి 2015 వరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

200 బిలియన్ డాలర్ల క్లబ్‌లో జుకర్‌బర్గ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: మెటా ఫౌండర్, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ సంపద మరింత పెరిగింది. గత రెండేండ్లుగా ఆయన నికర ఆదాయం ఆరురెట్లు పెరిగి 201 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఆయన కంపెనీ స్టాక్ విలువ అనూహ్యంగా పెరగడంతో ఆయన సంపద కూడా అదే స్థాయిలో పెరగడంతో ఆయన ఇప్పుడు ప్రపంచంలోని కుబేరుల జాబితాలో నాలుగో స్థానానికి చేరుకున్నారు. ఆయన కంటే ముందు ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, బెర్నార్డ్ ఆర్నాల్ట్ ఉన్నారు. జుకర్‌బర్గ్ సంపద 200 బిలియన్ డాలర్ల మార్కుకు చేరుకోవడం ఇదే తొలిసారి. 2022లో ఒక దశలో ఆయన వంద బిలియన్ డాలర్ల వరకు కోల్పోయినా అనూహ్యంగా పుంజుకున్నారు.

ఐదేండ్ల బాలుడిపై గ్యాంగ్ రేప్

లక్నో: ఐదేండ్ల బాలుడిపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేయడమే కాక, ఆ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన దారుణ ఘటన యూపీలో చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి లైంగిక దాడి చేసిన ఇద్దరు, దానిని వీడియో తీసిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. హాపూర్‌లో ఈనెల 19న ఉదయం మూడు గంటలకు జునైద్ అనే వ్యక్తి ఇంటి నుంచి తన మనవడిని ఒక నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడని, అక్కడ అతడికి మరో ముగ్గురు కలిశారని, వారిలో ఇద్దరు బాలుడిపై లైంగిక దాడి చేయగా, మిగిలిన ఇద్దరూ దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమంలో అప్‌లోడ్ చేసినట్టు బాధితుడి తాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పంజాబ్ సీఎం మాన్‌కు అరుదైన వ్యాధి

న్యూఢిల్లీ: పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అత్యంత అరుదైన 'లెప్టోస్పైరోసిస్' అనే బ్యాక్టీరియా వ్యాధి బారినపడ్డారు. కుక్కలు, ఎలుకలు మొదలైనవాటి విసర్జితాల నుంచి ఈ బ్యాక్టీరియా మనుషులకు సోకుతుందని, కలుషిత ఆహారం, నీటితో ఈ బ్యాక్టీరియా సీఎం భగవంత్ మాన్‌కు సోకినట్టు భావిస్తున్నామని న్యూఢిల్లీలోని సర్ గంగారామ్ దవాఖాన వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సోకినవాళ్లలో అధిక జ్వరంతో కూడిన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వాంతులు, డయేరియా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండు వారాల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవటం ద్వారా ఈ వ్యాధి తగ్గుతుందని అన్నారు.

లింగ మార్పిడికి మానసిక ఆరోగ్య ధ్రువీకరణ తప్పనిసరి

కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఇకపై ఇష్టారీతిన లింగ మార్పిడి చేయించుకోవడం కుదరదు. లింగమార్పిడి, ప్రీ-హార్మోనల్ థెరపీకి ముందు మానసిక ఆరోగ్య నిపుణుల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) విడుదల చేసింది. ఎవరైనా ట్రాన్స్‌జెండర్ 18 ఏండ్ల లోపు లింగ నిర్ధారిత సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుంది. అంతకుముందు ఏడాదిపాటు ఎండ్రోక్రైన్ చికిత్సపై స్థిరంగా ఉన్నట్టు సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ మేరకు గైనకాలజిస్టులు, సైకాలజీ/సైకియాట్రిస్టులకు కూడా కొన్ని సూచలను చేసింది. సర్జరీ తర్వాత ఆ వ్యక్తి ఎలా ఉండాలని కోరుకుంటున్నాడు, పేషెంట్ పేరు, సర్వనామం పరంగా ఎలా సంబోధించాలనుకుంటున్నాడు వంటివి అర్థం చేసుకోవాల్సి ఉంటుందని గైనకాలజిస్టులకు సూచించింది. అలాగే, ఎండోక్రినాలజీ పరీక్షకు ముందు సైకియాట్రిస్ట్ నుంచి ఒక సర్టిఫికెట్, లింగ నిర్ధారణ సర్జరీకి ముందు క్లినికల్ సైకాలజిస్ట్/సైకియాట్రిస్ట్ నుంచి మరో సర్టిఫికెట్‌ను ట్రాన్స్‌జెండర్లు సమర్పించాల్సి ఉంటుంది. వీరు పేషెంట్ మానసిక ఆరోగ్యాన్ని పరీక్షించి సర్టిఫికెట్ అందజేస్తారు.

భారీ వర్షాల కారణంగా కాఠ్మాండూలో వరదలో చిక్కుకున్న ఓ ప్రాంతం

నేపాల్‌లో వరద విలయం

170 మందికి పైగా మృతి

కాఠ్మాండూ: నేపాల్‌లో వరదలు విలయం సృష్టించాయి. వీటికి తోడు కొండ చరియలు విరిగి పడటంతో దేశవ్యాప్తంగా మృతి చెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 170కి పెరిగింది. ఆకస్మిక వరదల కారణంగా శుక్రవారం నుంచి తూర్పు, మధ్య నేపాల్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వరదలు, కొండ చరియలు విరిగి పడటం వల్ల 43 మంది గల్లంతయ్యారని, 111 మంది గాయపడ్డారని పోలీస్ వర్గాలు తెలిపాయి. భద్రతా బలగాలు 3626 మందిని రక్షించాయి. గత 40-45 ఏండ్లలో ఇలాంటి వరదలను ఎప్పుడూ చూడలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వరదల కారణంగా దేశంలోని చాలా ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. చాలా హైవేలు, రోడ్లు దెబ్బతిన్నాయి. వందలాది ఇండ్లు, వంతెనలు భూ స్థాపితమయ్యాయి లేదా కొట్టుకుపోయాయి. వందలాది కుటుంబాలు నిర్వాసితులయ్యాయి.

సునీతాను తీసుకొచ్చేందుకు స్పేస్‌ఎక్స్ క్రూ-9 ప్రయోగం

ఫ్లోరిడా, సెప్టెంబర్ 29: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బారీ విల్‌మోర్‌లు.. ఎట్టకేలకు తిరిగి రాబోతున్నారు. వారిని తీసుకొచ్చేందుకు స్పేస్-ఎక్స్ ప్రత్యేక మిషన్ చేపట్టింది. శనివారం ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ నుంచి క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఈ లాంచ్‌ప్యాడ్ నుంచి చేపట్టిన తొలి మానవ సహిత స్పేస్‌ఫ్లైట్ ఇదే. బోయింగ్ స్టార్‌లైనర్ ద్వారా సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఐఎస్ఎస్‌కి చేరుకోగా, తిరుగు ప్రయాణంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఇద్దరు వ్యోమగాములు గత 100 రోజులుగా అక్కడే చిక్కుకుపోయారు. నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాంలో భాగంగా స్పేస్-ఎక్స్ క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపుతున్నది. ఫిబ్రవరి 2025లో స్పేస్‌క్రాఫ్ట్ తిరుగు ప్రయాణంతో ఇద్దరు వ్యోమగాముల్ని భూమి మీదకు తీసుకొస్తారు.

ఐటీ ఉద్యోగి.. ఆఫీస్‌లోనే కుప్పకూలి!

కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం

ముంబై, సెప్టెంబర్ 29: కార్పొరేట్ కంపెనీల్లో ఎదురవుతున్న పని పరిస్థితులు ఎంతోమంది ఉద్యోగుల జీవితాల్ని చిత్తు చేస్తున్నాయి. తాజాగా నాగ్‌పూర్‌లో ప్రఖ్యాత ఐటీ సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. అతడికి భార్య, ఆరేండ్ల కుమారుడు ఉన్నారు. వాష్‌రూమ్‌కు వెళ్లిన అతడికి హఠాత్తుగా గుండెపోటు రావటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని ఐటీ సంస్థ అధికారులు ఆదివారం తెలిపారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 7 గంటలకు జరిగిందన్నారు. మృతుడు నితిన్ ఎడ్విన్ మైఖేల్ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఓ సీనియర్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు చెప్పారు. నాగ్‌పూర్ సిటీ మిహాన్ ప్రాంతంలోని హెచ్‌సీఎల్ కార్యాలయంలోని వాష్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడివుండగా, సహచర ఉద్యోగులు గుర్తించి దవాఖానకు తరలించారని, అయితే అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించినట్టు చెప్పారు.



1 నుంచి వచ్చే మార్పులివే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: పాన్, ఐటీ రిటర్న్స్, చిన్న మొత్తాల పొదుపు తదితర ముఖ్యమైన ఆర్థిక అంశాలకు సంబంధించి వచ్చే నెల 1 నుంచి కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. అవేంటో చూద్దాం..

- పాన్, ఐటీ రిటర్న్స్ – వ్యక్తులు పాన్ నెంబర్ కోసం, ఆదాయ పన్ను రిటర్న్స్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని ఉపయోగించడాన్ని అనుమతించరు.
- బోనస్ షేర్లు – టీ+2 ట్రేడింగ్‌కు; వాటి క్రెడిట్, ట్రేడింగ్ తేదీకి, రికార్డ్ తేదీ మధ్య సమయాన్ని తగ్గించడానికి బోనస్ షేర్లు అర్హత పొందుతాయి.
- చిన్న మొత్తాల పొదుపు పథకాలు – తపాల కార్యాలయాల్లోని క్రమరహిత ఖాతాల వివరాలను క్రమబద్ధీకరణ కోసం ఆర్థిక శాఖకు నివేదించాలి. తాత, బామ్మలు సుకన్య సమృద్ధి యోజనను తమ మనవరాలి పేరున ప్రారంభిస్తే వాటిని సంరక్షకులు లేదా జన్మనిచ్చిన తల్లి దండ్రుల పేరున మార్చుకోవచ్చు. రెండు కంటే ఎక్కువ ఖాతాలు తెరిచి ఉంటే, అదనపు ఖాతాలను మూసివేస్తారు.
- సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) – ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ మీద ఎస్‌టీటీ పెరుగుతుంది.
- రైల్వే స్పెషల్ డ్రైవ్ – రద్దీ వారాల్లో టికెట్ లేని ప్రయాణికులను గుర్తించడానికి రైల్వే స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది.
- పోస్టాఫీస్ ఖాతాలు, పీపీఎఫ్ వడ్డీ రేట్లలో మార్పులు – మైనర్ల పీపీఎఫ్ ఖాతాలు, చిన్న మొత్తాల పొదుపు ఖాతాల వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయి.
- వివాద్ సే విశ్వాస్ అమలు – వివిధ కోర్టులు, అప్పిలేట్ అథారిటీల్లో పెండింగ్‌లో ఉన్న పన్ను చెల్లింపుదారుల వివాదాలు, అప్పీళ్లు, పిటిషన్లు సెటిల్ చేసుకొనేందుకు అవకాశం.
- ధ్రువీకరించని లింక్‌లు, ఎస్ఎంఎస్‌లు బ్లాక్ – ఆమోదం పొందని, ధ్రువీకరించని యూఆర్ఎల్‌లు, ఓటీటీ లింక్‌లు, ఏపీకేలను టెలికం ప్రొవైడర్లు బ్లాక్ చేయాల్సి ఉంటుంది.

బీర్ కోసం బిడ్డను అమ్మేశారు!

అమెరికాలో తల్లిదండ్రుల దారుణం

వాషింగ్టన్: బీరు, వెయ్యి డాలర్ల (సుమారు రూ.83 వేలు) డబ్బు కోసం అమెరికాలోని ఓ జంట కన్నబిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించింది. నిందితులను నార్త్ వెస్ట్ అర్కాన్సస్‌కు చెందిన డేరియన్ అర్బన్, షలేన్ ఎహర్ల్స్‌గా గుర్తించిన పోలీసులు.. వారిద్దరినీ అరెస్ట్ చేశారు. మూడు నెలల పిల్లాడిని వారు బీరు, డబ్బు కోసం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అయితే అధికారులు వచ్చేసరికి బిడ్డ తల్లిదండ్రులు అక్కడ లేరు. బిడ్డను అధికారులు దవాఖానకు తరలించారు. బిడ్డ తల్లిదండ్రులు నివసించిన గుడారంలో వారు తమ బిడ్డను వెయ్యి డాలర్లకు అమ్మేయడానికి అంగీకరించిన లేఖను అధికారులు గుర్తించారు. తమ ఆలోచనలు మారవని.. బిడ్డ కోసం సంప్రదించమని వారు అందులో పేర్కొన్నారు.

చైనా మహిళకు రెండు గర్భాశయాలు

రెండింటి ద్వారా శిశువుల జననం

న్యూఢిల్లీ: వైద్య చరిత్రలోనే ఇది అత్యంత అరుదైన ఘటన. మహిళ కడుపులో రెండు గర్భాశయాలు ఉండడమే వింతైతే.. రెండింటి ద్వారానూ పిల్లల్ని కనడం మరో వింత. చైనాలో సెప్టెంబర్‌లో జరిగిందీ ఘటన. వాయువ్య చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌కు చెందిన మహిళ సెప్టెంబర్‌లో సిజేరియన్ ఆపరేషన్ ద్వారా బాబు, పాపకు జన్మనిచ్చింది. ఇందులో ఎలాంటి వింత లేకపోయినా.. ఆమెకు రెండు గర్భాశయాలు ఉండడం, ఒకేసారి రెండింటి ద్వారానూ ఆమె గర్భం దాల్చడం, ఒకేసారి కవలలకు జన్మనివ్వడం అత్యంత అరుదని వైద్యులు చెప్పన్నారు. ప్రపంచంలో ఇలా 0.3 శాతం మాత్రమే జరుగుతుందని పేర్కొన్నారు. ఆమెలో పుట్టుకతోనే రెండు గర్భాశయాలు ఉన్నాయని, రెండూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయని గుర్తించారు. సహజ పద్ధతిలో ఒకేసారి రెండు గర్భాశయాల ద్వారా ఆమె గర్భం దాల్చడం చాలా అరుదని, ఇప్పటి వరకు ఇలాంటివి రెండే రెండు జరిగాయని, అందులో చైనాలో ఇది మొదటిదని వివరించారు. ఎనిమిదిన్నర మాసాల గర్భంతో ఉండగా ఆమె ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిందని, బాబు 3.3 కేజీలు, పాప 2.4 కేజీల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారని, నాలుగు రోజుల అనంతరం దవాఖాన నుంచి డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.

చక్కెర వ్యాధికి చెక్!

- **మహిళలో టైప్-1 డయాబెటిస్ సంపూర్ణంగా నయం**
- **స్టెమ్ సెల్స్ థెరపీతో చైనా శాస్త్రవేత్తల అద్భుతం**

బీజింగ్, సెప్టెంబర్ 29: ప్రపంచ జనాభాలో దాదాపు 10 శాతం మంది మధుమేహ మహమ్మారితో బాధపడుతున్నారు. 2040 నాటికి ప్రతి ఎనిమిది మందిలో ఒకరు డయాబెటిస్ బారిన పడతారని తాజా అధ్యయనాలు అంచనావేస్తున్నాయి. మనదేశంలోనూ 7 కోట్ల మందికిపైగా చక్కెర వ్యాధి బాధితులు ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో మధుమేహాన్ని అంతమొందించేందుకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో చైనా శాస్త్రవేత్తలు గొప్ప విజయం సాధించారు. ఓ మహిళలో టైప్ 1 డయాబెటిస్‌ను సంపూర్ణంగా నయం చేశారు. స్టెమ్‌సెల్స్ థెరపీ ద్వారా పెకింగ్ వర్సిటీ మెడికల్ రిసెర్చ్ సెంటర్ పరిశోధకులు ఈ ఘనత సాధించారు. పరిశోధనలో పాల్గొన్న టియాన్‌జింగ్ నగరానికి చెందిన 25 ఏండ్ల మహిళ గత ఏడాదికాలంగా స్వేచ్ఛగా తీపి పదార్థాలను తింటున్నదని వైద్యులు తెలిపారు.

ఎలా సాధ్యమైంది?

ప్రపంచంలోనే తొలిసారిగా 59 ఏండ్ల వ్యక్తికి డయాబెటిస్‌ను పూర్తిగా నయం చేసినట్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. సెల్ ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా ఆయనకు వ్యాధిని నయం చేసినట్టు చెప్పారు. ఈ విధానంలో రోగి స్టెమ్‌సెల్స్‌ను ప్రత్యేక కెమికల్ కాక్‌టెయిల్ ద్వారా మార్పులు చేసి, వాటిని క్లోమంలో ప్రభావితమైన కణాల స్థానంలో ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఈ కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అయితే ఎంఆర్ఐ ద్వారా వీటిని పర్యవేక్షించేందుకు కష్టంగా ఉండేది. దీంతో కొత్త విధానంలో ఈ కణాలను పొత్తి కడుపు కింద, క్లోమగ్రంథికి దగ్గరగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. దీంతో ఎంఆర్ఐ ద్వారా సులభంగా పర్యవేక్షించవచ్చని వైద్యులు తెలిపారు. ఈ విధానం ద్వారా 25 ఏండ్ల మహిళకు టైప్ 1 డయాబెటిస్‌ను పూర్తిగా రివర్స్ చేసినట్టు వెల్లడించారు. ఇది ఇతర రోగుల్లోనే విజయవంతమైతే అద్భుతంగా ఉంటుందని డయాబెటిక్ పరిశోధకులు, క్యోటో యూనివర్సిటీకి చెందిన డైసుకే యాబే అభిప్రాయపడ్డారు.



పాక్‌లో ఆరు మంత్రిత్వ శాఖల మూసివేత!

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్ ఐఎంఎఫ్ షరతులకు అనుగుణంగా ఖర్చులు తగ్గించేందుకు పలు ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది. ఆరు మంత్రిత్వ శాఖలను మూసివేస్తున్నామని, మరో రెండింటిని విలీనం చేస్తున్నామని ప్రకటించింది. 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను రద్దు చేస్తున్నామని ఆదివారం వెల్లడించింది. ఐఎంఎఫ్‌తో సమావేశమైన ఆర్థిక శాఖ మంత్రి ఔరంగజేబు మీడియాతో మాట్లాడుతూ జీ-20 దేశాల్లో చేరేందుకు దేశ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సి ఉందని అన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 16 లక్షల నుంచి 32 లక్షలకు పెరిగిందని చెప్పారు. త్వరలోనే ఐటీ ఫైలింగ్ చేయని వారి క్యాటగిరీని రద్దు చేస్తామని, పన్ను చెల్లించని వారు ఇక నుంచి ఆస్తులను కానీ, వాహనాలను కానీ కొనుగోలు చేయలేరని ఆయన చెప్పారు.